క్లుప్తంగా

దీక్షిత్‌కు ఎస్పీ అభినందన

కొత్తగూడెంటౌన్: అథ్లెటిక్స్‌లో బంగారు పతకాలు సాధించిన జర్పుల దీక్షిత్‌ను ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు. శుక్రవారం ఎస్పీ కార్యాయంలోని ఆయన చాంబర్‌లో కోచ్ మల్లికార్జున్‌తో కలిసి ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ... దీక్షిత్ రుద్రంపూర్ పాలిటెక్నిక్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడని, హైదరాబాద్ రామాంతపూర్ పాలిటెక్నిక్‌లో స్టేట్ లెవల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో కొత్తగూడేనికి చెందిన దీక్షిత్ అథ్లెటిక్స్ పోటీల్లో మూడు బంగారు, రెండు రజిత పతకాలు సాధించినట్లు వివరించారు.

విధుల బహిష్కరణ

కొత్తగూడెంటౌన్: రంగారెడ్డి జిల్లాలో న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఏకగ్రీవంగా విధులను బహిష్కరించింది. శుక్రవారం కొత్తగూడెం జిల్లా కోర్టులోని లైబ్రరీహాల్‌లో జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ సభ్యులు ఏ.కరుణాకర్, ఎస్.ప్రవీణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు జలసూత్రం శివరాంప్రసాద్ మాట్లాడుతూ... న్యాయమూర్తిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు, అందుకు నిరసనగా బార్ అసోసియోషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీకే మనోహర్, సుధాకర్‌రావు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి, మల్లెల ఉషారాణి, మునిగడప వెంకటేశ్వర్లు, మారపాక రమేష్, రామారావు పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్య దైవం.. సంత్ శ్రీ సేవాలాల్

టేకులపల్లి: సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ బంజారా జాతికి ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్నారు. శనివారం సేవాలాల్ జయంతి వేడుకలకు గోలియాతండాలోని సేవాలాల్ ఆలయంలో సేవాలాల్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఇస్లావత్ నామా నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయంలో భోగ్ భండారో, మహా అన్నదానం, నిరుపేదలకు దుస్తుల పంపిణీ నిర్వహించనున్నారు. బంజారాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి..

ఇల్లెందు: ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ రాసుద్దీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందులోని శ్రీదేవీ ట్రాన్స్‌పోర్ట్‌లో మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 28 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చుతోందని, దీనిని వ్యతిరేకించాలన్నారు.

విద్యార్థులకు అవగాహన

జూలూరుపాడు: స్థానిక సాయి ఎక్స్‌లెంట్ స్కూల్‌లో శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు డార్విన్ పరిణామ క్రమంపై ఓరియంటేషన్ ప్రోగ్రాం లాయర్ మక్కడ అవగాహన కల్పించారు. పిల్లల్లో మూఢ నమ్మకాలను తొలగించి బంగారు భవిష్యత్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు సాయి ఎక్స్‌లెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు చెప్పారు. ఎ.కస్తూరి, ఎం.మోహన్‌రావు, సీహెచ్ తిరుమల పాలు పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళి

కొత్తగూడెంఅర్బన్: 2019లో పుల్వామా ఘటనలో అమలురులైన జవాన్లకి బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెంలో ప్రదర్శన నిర్వహించి, బస్టాండ్ సెంటర్‌లో నివాళులర్పించారు. బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ మెరుగు చింటేశ్వర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన జవాన్లను గుర్తుచేసుకోవాలని, పాశ్చాత్య దేశాల విష సంస్కృతి వీడాలన్నారు. కుశన సాగర్, ముచ్చకోర్తి కిరణ్, పవన్ జైన్, సన్నీ సాహో పాల్గొన్నారు.

రంజాన్‌ను స్వాగతించండి..

కొత్తగూడెంటౌన్: షబ్-ఏ-బరాత్ పుణ్యరాత్రి అల్లాహ్ సృష్టిలోని సమస్త మానవాళికి ముక్తి, ఆహారం, సంపద సృష్టిస్తాడని గౌతంపూర్ మసీద్ కౌసర్ మౌలానా మహమ్మద్ అన్నారు. షబ్-ఏ-బరాత్‌ను పురస్కరించుకుని గురువారం రాత్రి జాగారం నిర్వహించారు. మాట్లాడుతూ... షబాన్ నెల 15 అర్ధరాత్రి జరిగిన ఘటన ఇస్లామియా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. రంజాన్‌కు నెల రోజుల ముందు జరిగిన సంఘటనను షబ్-ఏ-బరాత్‌గా జరుపుకుంటారని చెప్పారు. ఆ రోజు రాత్రంతా ముస్లింలు జాగారం చేస్తూ మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు ఆచరిస్తారన్నారు. రంజాన్ నెలను స్వాగతించే విధంగా అందరూ సిద్ధం కావాలన్నారు. పాపాల మన్నింపు కోసం హృదయపూర్వకంగా భగవంతుని అర్థించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఉమర్, అబ్దుల్ ఫరీద్, గౌస్, తహేర్ అలీ బేగ్, తహేర్ పాషా, సిరాజ్, హాసం, మున్వర్, ఉమర్, షాకీర్‌పాషా, జహంగీర్ మియా, యాకుబ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

కోతులతో అష్టకష్టాలు...



- పంటలు, కూరగాయలు.. ఏవీ దక్కడం లేదు
- బయటకు రావాలంటేనే హడలిపోతున్న ప్రజలు
- జనం గగ్గోలు పెడుతున్నా పట్టని అధికారులు

అడవులలో కనిపించే వానరాలు నేడు జనావాసాల్లో సంచరిస్తున్నాయి. గ్రామాలలో వ్యాపార, వాణిజ్య పంటలను దక్కనివ్వడం లేదు. చివరకు ఇళ్లలో కూరగాయల చెట్లను కనీసం వేళ్లాను కోనివ్వడం లేదు. తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. ఇలా పగలూ..రాత్రి తేడా లేకుండా పల్లెల్లో వానర సైన్యం చేష్టలతో ప్రజలను ముప్పుతిప్పలు పెడుతోంది. ఎప్పుడు ఎవరి మీద దాడి చేస్తాయో తెలియని పరిస్థితి. వానరాల వల్ల నిత్యం ప్రజలు ఇంత ఇబ్బంది పడుతున్నా.. తమకేమీ పట్టనట్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల హడావుడి ప్రారంభం కావడంతో వానర చేష్టలపై నేతలను నిలదీసేందుకు జనం సిద్ధమవుతున్నారు.



సుభాష్‌నగర్‌లో గుంపులుగా సంచరిస్తున్న వానరాలు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వృద్ధులు, చిన్నారులు కాలినడకన బయటకు వెళ్లాలంటే చేతిలో కర్ర పట్టుకోక తప్పడం లేదు. ముఖ్యంగా వాకింగ్ చేసేవారిలో వయోభేదం లేకుండా చేతికర్రను వెంటపెట్టుకోక తప్పని పరిస్థితి నెలకొంది. ఏ వీధిలో చూసినా వానరాలే దర్శనమివ్వడంతో గమ్యం చేరుకునే వరకు భయం భయంగా రోడ్డుపై నడవాల్సి వచ్చింది. ఇక ఇంటి ఆరుబయిట కూర్చోవాలంటే చేతిలో గుల్బర్ ఉండాల్సిందే. గతంలో కోతులను భయపెట్టేందుకు కొండముచ్చులను వీధుల్లో తిప్పేవారు కానీ నేడు వాటికి కూడా కోతులు భయపడటం లేదు. దీంతో ప్రజలు కోతులను రక్షించుకునేందుకు కర్ర, గుల్బర్‌లను ప్రస్తుతం ఆయుధంగా వినియోగిస్తున్నారు.

ఎవరికీ పట్టని ప్రజల గోస..

ఏడేళ్లుగా హరితహారం పేరుతో ఇబ్బడిముబ్బడిగా చెట్లు నాటుతున్నారు. అందులో ఒక శాతం పండ్ల మొక్కలను అడవుల్లో పెంచినా నేడు కోతులు తిరిగి అడవులకు వెళ్లేవని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా మంకీ ఫుడ్ కోర్టులను అడవులకు సమీపంలో ఏర్పాటు చేస్తున్నా వాటి ఆలనపాలన ఎవరికీ పట్టకపోవడంతో ఆయా ప్రదేశాలు బోర్డులకే పరిమితమయ్యాయి. ఇదిలా ఉండగా నాలుగేళ్ల క్రితం స్థానిక సంస్థలు కోతులను పట్టించే ప్రయత్నం చేశాయి. కానీ అవి సత్ఫలితాలనివ్వకపోవడంతో వారు కూడా కోతుల బెడదను పట్టించుకోవడం మానేశారు. కనీసం ప్రత్యామ్నాయ చర్యలకు కూడా ఉపక్రమించలేదు. దీంతో సమస్య పరిష్కారానికి నోచుకోక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది.

కాగితాలకే పరిమితమైన నియంత్రణ...

గ్రామాలలో కోతుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. వాటిని నియంత్రించేందుకు గతంలో స్థానిక సంస్థల ప్రతినిధులు వాటిని పట్టించి సమీపంలోని అడవుల్లో వదిలేవారు. కానీ ఇది ఆశించిన ప్రయోజనం చేకూర్చకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలతో వాటి సంతతిని నియంత్రించాలని గతంలో ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇతర జీవుల మాదిరిగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించింది. ఆ దిశగా పలు జిల్లాల్లో పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రయత్నాలు కూడా ప్రారంభించారు. కానీ ఈ ప్రక్రియ కూడా ఆచరణకు సాధ్యం కాలేదు. ఫలితంగా వానరాల సంఖ్య క్రమంగా రెట్టింపవుతూ వస్తోంది.

కోతుల బెడద పైనే..

ప్రస్తుతం ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించింది. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికారులందరూ ఇదే హడావుడిలో ఉన్నారు. రేపో, మాపో స్థానిక సంస్థల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈసారి బరిలో నిలిచే నేతలకు కోతుల నియంత్రణే ప్రజల నుంచి ప్రధాన డిమాండ్‌గా ఎదురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాలలో వానరాల నుంచి రక్షణ పొందేందుకు ప్రత్యేకంగా నిధులు వెచ్చించాల్సి రావడం, ఉన్న వనరులను కోల్పోవడంతో ప్రజల నుంచి ఈ విధమైన అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కోతులను నియంత్రించాలి..



గ్రామాల్లో కోతుల సంచారం ఎక్కువైంది. వాటివల్ల అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన ఎవరూ చేయడం లేదు. ఈసారి కోతులను నియత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్న వారికే ఓటు వేస్తాం.

– యాటకూరి లీలావతి, సుభాష్‌నగర్

బయటకెళ్లాలంటే భయమేస్తోంది..



ఏ వీధిలో చూసినా కోతులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇంటి ఆవరణలో పెంచుకునే పూలమొక్కలను పీకేస్తున్నాయి. కూరగాయల మొక్కలు, గృహోపకరణాలను ఛిద్రం చేస్తున్నాయి. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. సమస్య పరిష్కరిస్తామన్న నేతలకే అ సారి మద్దతు ప్రకటిస్తాం.

– బొమ్మ సతీష్, తిలక్‌నగర్

జాతర వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

టేకులపల్లి: టేకులపల్లి మండలం బోడు రోడ్డులోని సీతారామ గుట్టపై ఉన్న పెద్దమ్మతల్లి జాతరను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కోరం సురేందర్, ఆలయ పూజారి భూక్యా సీతారామస్వామి కోరారు. ఈ మేరకు శుక్రవారం నంద్యా తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... ఈనెల 22న తిరుపతి వెంకన్న పూజలతో వేడుక ఆరంభం అవుతుందని, 23న రథయాత్ర ద్వారా పెద్దమ్మతల్లి గుడిలోకి ప్రవేశంతో జాతర ప్రారంభం అవుతుందన్నారు. 26 వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకుని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఊకే రామకృష్ణ, ఈది గణేష్, మోకాళ్ల పోశాలు, భూక్యా సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

బొగ్గు వ్యాగన్లు కేటాయించండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం రీజియన్‌లోని ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాలలో బొగ్గు రవాణా చేసేందుకు అవసరమైన వ్యాగన్లు కేటాయించాలని శుక్రవారం సౌత్‌సెంట్రల్ రైల్వే ఏరియా ఆఫీసర్ ఏఆర్ మీనాకు సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రీజియన్‌లో సింగరేణి సంస్థ ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల లక్ష్య సాధనకు కృషి చేస్తున్న క్రమంలో (ఇల్లెందుకు 40 లక్షల టన్నులు, మణుగూరు 80 లక్షల టన్నులు, కొత్తగూడెం ఏరియా 140 లక్షల టన్నులు సుమారుగా) రవాణా చేయనున్నాయని, వీటికి అవసరమైన రైలు వ్యాగన్లు రవాణా చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఏఓ సకాలంలో వ్యాగన్లు సరఫరా చేయిస్తామని తెలిపారు. అదేవిధంగా లోడింగ్ విషయంలో సీహెచ్‌పీలకు అధికారులు, సిబ్బంది రైల్వేకు సహకరించాలని కోరారు.

ప్రతీ పని సంస్థ ఉద్యోగులతోనే చేయించాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో వీకే ఓసీ కొత్త ప్రాజెక్ట్ వస్తోందని, ఇందుకు సింగరేణి అధికారుల కృషి గణనీయమని, ఈ ఓసీలో ప్రతీ పనిని సంస్థ ఉద్యోగులతో చేయించాలని ఏరియా జీఎం శాలేంరాజును హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ కోరారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ.. కిష్టారం ఓసీలో మాదిరిగా ప్రైవేట్ వారితో ఉత్పత్తి చేయిస్తామంటే ఒప్పుకునేది లేదని, కొత్తగూడెం ఏరియాలో కార్మికులు లేక ప్రతీవాడ, ప్రతీ మార్కెట్ వెలవెల బోతుందని, ఓసీలను ప్రైవేట్ వారికి ఇచ్చి స్థానిక యువతకు అన్యాయం చేయొద్దన్నారు. అందరం కలిసి పనిచేస్తూ సంస్థను ముందుకు తీసుకెళ్దామన్నారు. ఆంజనేయులు, ఆసిఫ్, చిట్టిబాబు, అబ్దుల్ మోగిని, సాంబశివరావు, లక్ష్మణ్, కరీం తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసే వరకు ఉద్యమం

ఇల్లెందురూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు అన్నారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని మర్రిగూడెం గ్రామంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేయడం ప్రజలను మోసగించడమేనన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం నేడు నిబంధనలు అంటూ అన్యాయం చేసిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులకు అర్హుల ఎంపిక ప్రహసనంగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరరావు, పూనెం కోటయ్య, జోగా కాంతారావు, రాంబాబు, చంటి, రమేష్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలని వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడెం డివిజన్ నాయకురాలు వీరమళ్ల ఉమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం 16వ తేదీన చలో హైదరాబాద్ రాష్ట్ర సదస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు గడిచినా నేటి ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వి.మల్లయ్య, చేరాలు, యాకయ్య, సోమ సుజాత, నాగమ్మ, వంశీ, గంగమ్మ, అరుణ పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: రెడ్డిగూడెంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): భజన మందిరం 33/11 కేవీ భజన మందిరం సబ్‌స్టేషన్, విద్యులైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేతాజీ మార్కెట్, పెద్దబజార్, చిన్న బజార్, కూలీలైన్, గాజుల రాజం బస్తీ, హనుమాన్ బస్తీ, బూడిదగడ్డ, సాయినగర్, శ్రీనగర్‌కాలనీ, గణేష్‌బస్తీ ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు టీయూసీఐ జిల్లా మహాసభ

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 16న జరగనున్న టీయూసీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రీజియన్ కార్యదర్శి పెద్దబోయిన సతీష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేట్ ఏరియాలోని వివిధ అడ్డాలలో ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఈ మహాసభలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలతో పాటు, వేతనాల సవరణ, భవిష్యత్ కార్యచరణ అంశాలను చర్చించనున్నామని, ఈ మహసభలో అన్నివర్గాల ప్రజలతోపాటు సంఘటిత, అసంఘటిత వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

జూలూరుపాడు: వసంత పంచమి పేరుతో ముందుస్తుగా అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రామ్ చరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడు హైస్కూల్‌లో మాట్లాడుతూ... అక్రమ అడ్మిషన్లతో విద్యార్థుల నుంచి సంవత్సర ఫీజులో కొంత డబ్బును ముందుగా కట్టించుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యాలపై కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి..

జూలూరుపాడు: వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జూలూరుపాడు హైస్కూల్‌లో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను కలిసి బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సతీష్, తెల్లం నరసింహారావు, సున్నా రమేష్, సిరిపురపు ప్రసాద్, భూక్యా రమేష్, సిరిపురపు గోపాల్‌రావు, నర్వేనేని కృష్ణ, పూరేటి వెంకటేశ్వర్లు, పుల్లారావు, శ్రీను, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ కాలేజీకి 'న్యాక్ బీ++'

సుజాతనగర్: మండలంలోని అబ్దుల్ కలామ్ ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ బీ++ గుర్తింపు లభించింది. ఈ మేరకు బెంగుళూరులోని కార్యాలయం గురువారం వెల్లడించిందని కళాశాల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చావా లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో వారు మాట్లాడుతూ.. కొద్దిరోజుల క్రితం న్యాక్ బృందం కళాశాలను పరిశీలించగా సౌకర్యాలు, ఫలితాలపై సంతృప్తి చెందడంతో ఐదేళ్లకు చెల్లుబాటయ్యేలా బీ++ గ్రేడ్ కేటాయించిందని తెలిపారు. ప్రిన్సిపాల్ దయాకర్, న్యాక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌తో పాటు రమేష్, శ్రీకాంత్, సైదయ్య, బాబురావు, లక్ష్మతి, చిరంజీవి, మునీర్, కృష్ణమోహన్, రవికిరణ్, వినోద్, అయూబ్, అంబిక పాల్గొన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

చోరీలు జరగకుండా అప్రమత్తత

టేకులపల్లి: దొంగతనాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇల్లెందు డీఎస్పీ ఎన్.చంద్రభాను అన్నారు. ఈ మేరకు శుక్రవారం కోయగూడెం ఓసీలో ఆఫీసర్లు, కార్మికులు, ఉద్యోగులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ మధ్యకాలంలో జరిగే దొంగతనాల గురించి, జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. సీసీ కెమెరాలు పనితీరు, వాటి ప్రాముఖ్యతను, దొంగతనాలు జరగడానికి దారితీసే పరిస్థితులు, నివారణ చర్యలు సూచించారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత మరియు డ్రగ్స్, సంఘ విద్రోహ కార్యకలాపాలపై తెలియజేశారు. ఈ సమావేశంలో సీఐ టి.సురేష్, బోడు ఎస్సై పి.శ్రీకాంత్, కోయగూడెం ఓసీ ప్రాజెక్టు మేనేజర్ సౌరబ్ సుమన్, డిప్యూటీ మేనేజర్ రవికుమార్, అండర్ మేనేజర్ మధుసూదన్, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఎం దుర్గారావు

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాల్లో సభ్యులైన ప్రతీ మహిళ ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో సెర్ప్ పనిచేస్తోందని సెర్ప్ ఏపీఎం దుర్గారావు అన్నారు. మామిడిగూడెం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెరుగైన ఆర్థిక స్థిరత్వం, సామాజిక భద్రత పథకాల ద్వారా భవిష్యత్ కోసం ప్రణాళిక రూపొందించుకొని మెరుగైన జీవన ప్రమాణాన్ని పెంపొందించుకునేందుకు పొదుపు సంఘాల మహిళలు కృషి చేయాలన్నారు. మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, పలు ఇన్సూరెన్స్ పథకాలు, రూపే కార్డు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రజలను ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్న సైబర్ నేరాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాల ఎలా చేస్తారు.. వాటి నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఫైనాన్షియల్ లిట్రసీ కౌన్సిలర్లు నవీన్, పుష్ప, సీసీ రాంబాబు, గ్రామ సంఘం అధ్యక్షురాలు సునిత, కార్యదర్శి ఇంద్రజ, కోశాధికారి యశోద రాణి, వీఓఏ ప్రతాప్ పాల్గొన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి

జూలూరుపాడు: మిర్చి పంట క్వింటాకు రూ.25 వేలు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడు పార్టీ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోళ్లు జరపాలన్నారు. గిట్టుబాటు ధర కోసం మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది తెగుళ్ల సోకి మిర్చి పంట దిగుబడి తగ్గిందని, మార్కెట్‌లో కూడా సరైన ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఖమ్మం మార్కెట్‌కు లక్షల బస్తాలకు పైగా మిర్చి అమ్మకానికి వచ్చిందని, జెండా పాట రూ.14 వేలకు పైగా పలికినప్పటికీ వ్యాపారులు రూ.13 వేలకే కొనుగోలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో వల్లమల్ల చంద్‌ర్‌రావు, గార్లపాటి వెంకటి, గడిదేశి కనకరత్నం, ఆనగంటి సత్యనారాయణ, బోడా అభిమిత్ర, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేష్

తునికాకు ప్రూనింగ్ పనులు చేపట్టండి..

ఇల్లెందురూరల్: ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనులకు రెండో పంటగా ఉన్న తునికాకు టెండర్లు ఆహ్వానించి ప్రూనింగ్ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తునికాకు కూలీలు శుక్రవారం అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అటవీశాఖ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్దుల్ నబీ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ మాట్లాడుతూ.. ఆకు సేకరణకు గడువు సమీపిస్తున్నా అటవీశాఖ అధికారులు టెండర్లు ఆహ్వానించకుండా, ప్రూనింగ్ పనులు ప్రారంభించకుండా జాప్యం చేయడం వల ఆకు సేకరణపై ప్రభావం చూపుతుందన్నారు. అంతే కాకుండా ఆకు సేకరణను రెండో పంటగా భావించే గిరిజనులు ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు తక్షణం స్పందించాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, తాళ్లూరి కృష్ణ, వజ్జ సురేష్, రాజమౌళి, వెంకన్న, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న గోపాల్‌రావు

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులోని ఉప మార్కెట్ యార్డును శాశ్వత వ్యవసాయ మార్కెట్‌గా ఏర్పాటు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 16న కొత్తగూడెంలో జరగనున్న టీయూసీఐ ప్రథమ జిల్లా మహాసభ విజయవంతం కోసం శుక్రవారం హమాలీలు, జీపీ కార్మికులతో కలిసి ఆయన స్థానిక ఉప మార్కెట్ యార్డులో విస్తృతంగా ప్రచారం చేశారు. మాట్లాడుతూ... హమాలీల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉప మార్కెట్ యార్డు ద్వారా రూ.కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో మార్కెట్ అధికారులు విఫలమయ్యారన్నారు. మార్కెట్ కోసం కేటాయించిన ప్రభుత్వం స్థలంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. టీయూసీఐ జిల్లా మహాసభకు అధిక సంఖ్యలో కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి బానోత్ ధనవంతరావు, తంబర్ల లక్ష్మి, సోడె నరసింహారావు, బూరం నరసింహారావు, దొడ్డా ఉదయ్‌కుమార్, కాలం ప్రశాంత్, తాటి నవీన్, హమాలీలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వండి..

సింగరేణి(కొత్తగూడెం): వర్క్‌షాపులో పనిచేసే ఉద్యోగులకు సర్వీస్ లింక్డ్ ప్రమోషన్ (ఎస్ఎల్‌పీ) ప్రకారం రావాల్సిన ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల విషయంలో జాప్యం జరుగుతోందని వెంటనే వీరికి రావాల్సిన ప్రమోషన్లు కల్పించాలని ఏరియా వర్క్‌షాపు ఏజీఎం శ్రీకాంత్‌కు శుక్రవారం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ... సింగరేణి వ్యాప్తంగా కొత్తగూడెం ఏరియా ఉత్పత్తిలో పెద్దన్న పాత్ర పోషిస్తుందంటే అందులో ప్రధాన కారణం ఏరియా వర్క్‌షాపులో పనిచేసే ఉద్యోగులని, ఏరియాలో ఎటువంటి బ్రేక్ డౌన్‌లు జరిగినా అందుకు స్పందించి రేయింబవళ్లు కష్టపడి పనిచేసే వర్క్‌షాపు ఉద్యోగులను ఏరియా అధికారులు నిర్లక్ష్యం చేయటం తగదన్నారు. సంవత్సరం ముందు ఉద్యోగ విరమణ పొందే ఉద్యోగులకు సమాచారం ఇవ్వాలని, సీఎంపీఎఫ్ స్లిప్పులు ఇవ్వాలన్నారు. అదే విధంగా టర్మినల్ బెనిఫిట్స్ సకాలంలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాకూబుద్దీన్, సత్తార్‌పాషా, అశోక్, జయరాజ్, చందులాల్, వెంకటస్వామి, కోటేశ్వరరావు, సముద్రాల శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, కుమార్, తిరుపతి, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపు హెచ్ఓడీ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజాక్